విస్తరణలో రగడ


అధికారులతో వాగ్వాదం చేస్తున్న స్థానికులు


పనుల్ని అడ్డుకుంటున్న ప్రజలు

- టీపీఎస్ తీరుపై మండిపడిన గృహ యజమానులు, స్థానికులు
- అడ్డగోలు తొలగింపులపై వాగ్వాదం

కనిగిరి రూరల్: పట్టణంలో విస్తరణ పేరితో మున్సిపల్ అధికారులు చేపడుతున్న ప్రక్రియ పలు విమర్శలకు దారి తీస్తోంది. గత నాలుగు రోజులుగా జరుగుతున్న విస్తరణ పనుల్లో భాగంగా శనివారం గార్లపేట రోడ్డులోని పోలీస్ క్వార్టర్స్ వద్ద గల దేవకి కాంప్లెక్స్ భవన సముదాయాల్లో ఆక్రమణలున్నాయంటూ కూల్చి వేతకు ఉపక్రమించడంతో యజమానులు, స్థానికులు అడ్డుకున్నారు. దీంతో గృహ యజమానులకు, టీపీఎస్ సువర్ణ కుమార్‌కు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఏ నిబంధన ప్రకారం తమ భవనాలను పడగొడతారని యజమానులు నిలదీశారు. మున్సిపాలిటీ స్థలంగా ఉంటే తమకు రికార్డులు చూపించాలని కోరారు. తమ దగ్గర డాక్యుమెంట్లున్నాయని వాగ్వావాదానికి దిగారు. ఉద్దేశ్య పూర్వకంగా ప్రజల ఆస్తులపై దాడులు చేస్తే భవిష్యత్తులో కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని.. మీ ఉద్యోగాలకే ఇబ్బంది జరుగుతుందని తీవ్రంగా ప్రతిఘటించారు. మున్సిపాలిటీ స్థలంలో మూడు అడుగుల ఆక్రమణ ఉందని టీపీఎస్ వాదించారు. అలా ఉందని రికార్డు పూర్వకంగా ఆధారాలు చూపిస్తే తామే మనుషులను పెట్టి తీసి వేస్తామని చెప్పారు. పూరతన కాలం నాటి కట్టడాలకు పొక్లెయిన్ తగిలితే పూర్తిగా కూలిపోతాయని.. అప్పుడు మీరు నష్ట పరిహారం చెల్లిస్తారా అంటూ వాదించారు. దీంతో తాత్కలికంగా మెట్ల వరకు తొలగింపు చేశారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

కనిగిరి రూరల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో విద్యుత్ సమస్యల పరిష్కారంకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. శనివారం పట్టణంలోని 8,9 వ వార్డుల్లో విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. కౌన్సిలర్లు షఫీ జాస్మిన్, చోప్పరపు మాధవి శివ, విద్యుత్ ఏఈ పవన్ కుమార్, ఎల్‌ఎం వెంకటయ్య, తిరుపతయ్య, ఖాజా మొహిద్దీన్ పాల్గొన్నారు.

రావూరి మాధవికి నివాళి


రావూరి మాధవి మృతదేహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ మాదాసి వెంకయ్య

కొండపి: నేతివారిపాలెంలోని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు రావూరి వెంకటేశ్వరరావు సతీమణి రావూరి మాధవి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య రావూరి మాధవి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. నేతివారిపాలెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ సీనియర్ నాయకుడు దివి శ్రీనివాసరావు, గ్రామ నాయకులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త


సింగరాయకొండలో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పొన్నలూరు: ప్రస్తుతం జరుగుతున్న సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అనుక్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ మోసాలు, డ్రగ్స్, ర్యాగింగ్, లైంగిక దాడులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి మొబైల్‌కు వచ్చే లింకులను, ఓటీపీలను ఎవరికీ చెప్పకూడదన్నారు. అలాగే డ్రగ్స్‌కు బానిసలుగా మారితే జీవితం నాశనమవుతుందన్నారు. కళాశాలకు వచ్చే క్రమంలో ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే 100కు డయల్ చేయాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడకుండా ప్రతి విద్యార్థి సోదర భావంతో మెలిగి ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు.

సింగరాయకొండ: సైబర్ నేరాల పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. స్థానిక సర్కిల్ పరిధిలోని పోలీసులు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలని వివరించారు. అలాగే మలినేని సుశీలమ్మ మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో అవగాహన కల్పించారు. వాహనాల డాక్యుమెంట్లు సక్రమంగా ఉండాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సైలు బి. మహేంద్ర, నాగమల్లేశ్వరరావు, ఏఎస్సైలు, ఎంబీఏ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జి. కోటయ్య అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో అవగాహన కల్పించారు. హెచ్ఎం తిరుపతయ్య పాల్గొన్నారు

బెల్ట్ షాపులు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు

కొండపి: సర్కిల్ పరిధిలో ఎవరు అయినా బెల్ట్ షాపు నిర్వహిస్తే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని సీఐ సోమశేఖర్ అన్నారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో మాట్లాడారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే తన నంబర్ 9121102114తో పాటు కొండపి ఎస్సై ప్రేమ్ కుమార్ (9121102109), పొన్నలూరు ఎస్సై అనూక్ (9121102207), మర్రిపూడి ఎస్సై రమేష్ బాబు (9121102177) సమాచారం ఇవ్వాలన్నారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఏకగ్రీవం

కొండపి: స్థానిక దాసిరెడ్డిపాలెం ఎంపీపీ పాఠశాలలో శనివారం యూటీఎఫ్ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కె. వెంకయ్య జిల్లా పరిశీలికుడు కె.రమేష్ ఆధ్వర్యంలో కొండపి మండల యూటీఎఫ్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మిడ్ డే మీల్స్‌పై సంతృప్తి

సింగరాయకొండ: విద్యార్థుల సామర్థ్యాలు బాగున్నాయని ఇదే ఒరవడిని కొనసాగించాలని ఎంపీడీఓ డి. జయమణి ఉపాధ్యాయులకు సూచించారు. కలికవాయ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. రికార్డులు, మిడ్ డే మీల్స్‌పై సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం నిడమానూరి సురేంద్ర పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

హనుమంతునిపాడు: మండల పరిధి సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పీడీ షేక్ జిలానీబాషా, హెచ్‌ఎం పద్మావతిలు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు సీతారాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎస్.జీఎఫ్ త్రోబాల్ అండర్ 14, అండర్ 17 విభాల్లో బాల బాలికలు సెలక్షన్స్ కమిటీలో చోటు దక్కించుకున్నారు. విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పామూరు: ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ లక్ష కార్డుల ఉద్యమం వాల్‌పోస్టర్‌ను స్థానిక అంబేడ్కర్ గంథాలయంలో శనివారం రాత్రి సంఘ నాయకులు దమ్ము కార్తీక్, జొన్నలగడ్డ గోవిందయ్య ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ జీవిత చరిత్రను 6వ తరగతి నుంచి పీజీ వరకు పాఠ్యాంశంగా పెట్టాలని, అదేవిధంగా మరో 10 డిమాండ్లతో కూడిన వాల్‌పేపర్‌ను వారు ఆవిష్కరించారు. కొట్టే రవీంద్ర, ఎ.సత్యనారాయణ, జె.పోతురాజు, వి.రాజశేఖర్, రాగి పోతురాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

కనిగిరి రూరల్: రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకులు చుండూరి రంగరావు, కె. వీరారెడ్డి అన్నారు. ఈనెల 26న కలెక్టరేట్ వద్ద సంయుక్త కిసాన్ ఆధ్వర్యంలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం పట్టణంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. బడుగు వెంకటేశ్వర్లు, గుజ్జుల బాలిరెడ్డి, పిల్లి తిప్పారెడ్డి, సీఐటీయూ నాయకులు పీసీ కేశవరావు, నరేంద్ర, శాంత కుమారి, ఓబయ్య, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

399 మద్యం సీసాలు ధ్వంసం


టంగుటూరులో మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

టంగుటూరు: మండల పరిధిలో 30 కేసుల్లో నమోదైన 399 మద్యం బాటిళ్లను ఎక్సైజ్ శాఖ, పోలీసుల ఆధ్వర్యంలో కొండపి ఫ్లెక్టైవర్ వద్ద రోలర్ సహాయంతో శనివారం ధ్వంసం చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు టంగుటూరు పోలీసు స్టేషన్ పరిధిలో 2023-24 సంవత్సరాల్లో నమోదైన 30 అక్రమ మద్యం కేసుల్లో 380 క్వాటర్ బాటిళ్లు, 16 ఫుల్ బాటిళ్లు, మూడు బీరు బాటిళ్లు, 15 లీటర్ల నాటు సారా ధ్వంసం చేశారు. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఎక్సైజ్ డీఎస్పీ పి. ఈ వెంకట్, సింగరాయకొండ సీఐ చావా హాజరత్తయ్య, ఎక్సైజ్ సీఐ ఈశ్వరరావు, టంగుటూరు ఎస్సై నాగమల్లీశ్వర రావు పాల్గొన్నారు.

బహిరంగ మల,మూత్ర విసర్జన నేరం

కనిగిరి రూరల్: పట్టణంలో బహిరంగ మల, మూత్ర విసర్జన రహితంగా పట్టణం ఉండాలని పురపాలక సంఘంగా తీర్మానించినట్లు మున్సిపల్ కమిషనర్ డానియేల్ జోసఫ్ తెలిపారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పురపాలక సంఘంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు, పట్టణంలోని మహిళా స్వయం సహాయక సభ్యులు, వార్డు సభ్యులతో కలిసి బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత పట్టణంగా తీర్మానించినట్లు తెలిపారు. ప్రజలంతా సహకరించి బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయకుండా ఉండాలని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘిస్తే రూ. 500 జరిమానా, 10 రోజులు జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. ఈ తీర్మానంపై ఏమైన అభ్యంతరాలు ఉంటే పురపాలక సంఘం కార్యాలయంలో తెలియజేయాలని వెల్లడించారు.

భైరవకోనలో రిటైర్డ్ ఐఏఎస్ పూజలు


మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికల వళవన్‌ను సన్మానిస్తున్న ఈఓ, నాయకులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరవకోన శనివారం రాత్రి రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికల వళవన్ సందర్శించారు. ఈఓ వంశీకృష్ణారెడ్డి, ముప్పాళ్ల శ్యామ్ సుందర్‌రాజుతో త్రిముఖ దుర్గాదేవి, కాలభైరవ, నగరేశ్వర, భర్గలేశ్వర ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనం చేయగా ఈఓ వంశీకృష్ణారెడ్డి, ముప్పాళ్ల శ్యామ్‌సుందర్ రాజు వళవన్‌ను స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎం.వెంకటనరసయ్య, అర్చక, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పీసీపల్లి: మండ్లపల్లిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో శనివారం డాక్టర్ ఉండాల మంజుల ఆధ్వర్యంలో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 79 మంది విద్యార్థులకు 44 పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఎస్ఓ సుజాత, ఎంఈఓ సంజీవి, సీహెచ్ఓ లక్ష్మి సుజాత పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ.25 వేల సాయం

పామూరు: మండల కేంద్రమైన పామూరుకు చెందిన దేవనపల్లి అనిల్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం మృతుని భార్యకు పామూరుకు చెందిన ఆర్యవైశ్య సంఘ నాయకులు మెంటా నరసింహారావు రూ.25 వేల నగదు అందజేశారు.